
# పువ్వులమ్ముకుంటున్నాడు

ప్రఫుల్ల చంద్ర




**రామభద్రయ్యకు ఒక కోరిక మిగిలిపోయింది. చివరి కోరిక కాదు గానీ చిరకాల కోరిక. ఆయన ఎన్ని సార్లు తిరుపతికి వెళ్ళినా, కొండ ఎక్కడం, పడిగాపులు పడుతూ దైవ దర్శనం చేసుకొని హడావుడిగా కొండ దిగి ఇంటికి బయలుదేరడం.**

అంతేగానీ నాలుగు రోజులుండి స్థిమితంగా పరిసరాలు పరిశీలించి అందాలు ఆస్వాదించి ప్రశాంతంగా గడిపింది లేదు. ఆనందించింది లేదు.


సత్రంలో నాలుగు రోజులుండడం కుదరదు. లాడ్జికోసం వందలు ఖర్చుపెట్టడం ఆయనకిష్టం లేదు. పడుకోడానికి కాస్త వసతి కల్పించే బంధువులెవరైనా తిరుపతిలో ఉన్నారా అని ఆలోచించగా స్నేహితుని కొడుకు సంజయ్ అక్కడే ఉంటున్నాడని తెలిసి వివరాలు కనుక్కోడానికి స్నేహితుని కలిశాడు రామభద్రయ్య.

పరిస్థితి వివరించి ఇంతకూ మీ అబ్బాయి తిరుపతిలో ఏం చేస్తున్నాడని అడిగాడు.

"పువ్వులు అమ్ముకుంటున్నాడు" ఠక్కున చెప్పాడాయన. నమ్మలేకపోయాడు రామభద్రయ్య.

బస్టాండ్ వద్ద, ఆలయాలు, సినిమాహాళ్ళ వద్దా రూపాయి పూలు కొనండమ్మా అని వెంటపడి వేధించే పూలు అమ్ముకునే పిల్లలు జ్ఞాపకం వచ్చారాయనకు.

బి.టెక్. చదివిన కుర్రాడు పువ్వులమ్ముకోవడం ఏమిటన్న అనుమానం వేదిస్తోంది ఆయన్ని. స్నేహితుడు వేళాకోళప్రియుడు. తనని ఆటపట్టించడానికలా చెప్పాడా? స్నేహితుని వైపు తేరిపార చూశాడు. ఆ ముఖం గంభీరంగానే ఉంది. కాదు, వేళాకోళం కాదు.



**రావుబహద్దూర్ ఆదెళ్ళ రంగనాయకులు నాయుడు ఆదెళ్ళ శ్రీరామమూర్తి నాయుడు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ మరియు ప్రియదత్త వారపత్రిక నిర్వహించిన కథల పోటీలో ప్రథమ బహుమతి రూ. *2,116/-* లు పొందిన కథ**

తిరుపతిలో పువ్వులమ్ముకుంటున్న సంజయ్ బహుశా పూరిపాకలో నివసిస్తూ ఉండొచ్చు. అక్కడికెళ్ళి ఇబ్బంది కలిగించడం ఎందుకు అనిపించింది రామభద్రయ్యకు.

"మరేం ఫర్వాలేదు. మీకే లోటూ లేకుండా చూసుకుంటాడు. తప్పక వెళ్ళండి" అని మరీ మరీ చెప్పి అడ్రస్ యిచ్చాడు స్నేహితుడు. ఆయనేదో మొగమాటానికి పోతున్నాడనిపించింది రామభద్రయ్యకు.

ఆయన కూతుళ్ళకు వివాహం చేశాడు. కొడుకులు ఉద్యోగాలు చేసుకుంటున్నారు. బాధ్యతలన్నీ తీరిపోయాయి. అందుకే తిరుపతికి వెళ్ళి ప్రశాంతంగా నాలుగు రోజులు గడపాలని, ఖర్చు అయినా సరే, లాడ్జిలో బసచేసి అయినా సరే, అని తెగించి భార్యతో బయలుదేరాడు. నేరుగా తిరుమలకు వెళ్ళి ఎమినిటీస్ భవనంలో ఒక లాకర్ సంపాదించాడు.

సుదర్శనచక్రం వేయించుకుంటే మర్నాడు సాయంకాలం నాలుగుకి దర్శనం అని చెప్పారు. ఈ లోగా పాపనాశనం వెళ్ళి స్నానం చేసి పరిసర ప్రాంతాలు సందర్శించి ప్రకృతి రమణీయత చూసి పరవశించిపోయారు, ఆ దంపతులు.

మర్నాడు తిరుమలలోనే తోటలూ భవనాలూ చూసుకుంటూ తిరిగి సాయంకాలం దర్శనం చేసుకొని రాత్రి అక్కడే ఉండిపోయారు.

ఉదయానే కొండ దిగి తిరుపతికి వచ్చారు.

సంజయ్‌ని కలవకుండా వెళ్ళిపోతే స్నేహితుడు బాధపడవచ్చు. అందువల్ల అతనిని కలిసి కాసేపు కబుర్లు చెప్పి మాట తీరుబట్టి ఎక్కడ ఉండాలో నిర్ణయించుకోవచ్చని అడ్రస్ పట్టుకొని ఆటోలో బయలుదేరారు రామభద్రయ్య దంపతులు.

ఒక డాబా ఎదుట ఆటో ఆగింది. ఆ డాబాని చూస్తేనే ఆశ్చర్యపోయాడు రామభద్రయ్య. పువ్వులమ్ముకునేవాడి కొంపలాగ కాక ఆఫీసర్ యిల్లులాగ ఉంది. కాంపౌండ్ గోడమీద పెద్ద బోర్డు. అందంగా పెద్ద అక్షరాల్లో "మొగలి" అని, దాని కింద కాస్త చిన్న అక్షరాల్లో "ఫ్లోరిస్ట్" అని రాసి ఉంది. ఇంకా కింద "మాలలు, బొకేలు, గిఫ్ట్ ఆర్టికల్స్, డిజైనర్ శారీస్ లభించును" అని ఉంది.

భార్యని ఆటోలోనే ఉండమని రామభద్రయ్య ఇంట్లోకి వెళ్ళాడు.

ఆశ్చర్యం! అక్కడున్నది సంజయే!

"నాన్నగారు ఫోన్ చేసి చెప్పారు. మీరు మూడు రోజుల క్రితమే వస్తారనుకున్నాం. ఏమిటీ, దైవదర్శనం చేసుకునే వస్తున్నారా?" సంజయ్ స్వరంలో ఆశ్చర్యం ధ్వనించింది.

గుండు తడుముకున్నాడు రామభద్రయ్య.

పరుగున ఆటోవద్దకెళ్ళి లక్ష్మమ్మను ఆహ్వానించి లగేజీ మోసుకొచ్చాడు సంజయ్. భార్య సుజయను పిలిచి పరిచయం చేశాడు. ఆ ఇల్లు చూశాక సంజయ్ దంపతుల ఆప్యాయత గమనించాక మనం యిక్కడ ఉండొచ్చు అనిపించింది రామభద్రయ్య దంపతులకు.

ఆ యింటి మొదటి గది నిండా అద్దాల బీరువాలు, టేబుళ్ళు. మూడు బీరువాల్లో చీరలు, ఒక దానిలో రకరకాల గిఫ్ట్ ఆర్టికల్స్. ఒక టేబుల్ మీద వెదురుబద్దలు, కలపతో చేసిన చిన్నచిన్న బుట్టలు. ఇంకో టేబుల్ మీద కంప్యూటర్, ఏవేవో పరికరాలు.

"నువ్వేదో పువ్వులమ్ముకొని బ్రతుకుతున్నావని మీ నాన్న చెబితే.." రామభద్రయ్య యింకా ఏదో అనేలోగా "పువ్వులమ్ముకున్న చోటే కలపా అమ్ముకుంటున్నా" అని నవ్వేశాడు సంజయ్.

స్నానాలూ, టిఫిన్‌లూ అయ్యాక కబుర్లు చెప్పుకుంటూ అందరూ వీధి గదిలోకి వచ్చారు.


చీరలు కొనడానికెవరో రాగా బీరువా తెరిచి చూపిస్తోంది సుజయ. రకరకాల లతలూ, పూలూ అప్లిక్ వర్క్ చేసిన బార్డర్‌తో, పల్లూతో మనోహరమైన డిజైనర్ చీరలవి. ఆ పువ్వుల, లతల కలర్ కాంబినేషన్ చక్కగా కుదిరింది. చీరలన్నీ ఒకదాన్ని మించి ఒకటి ఉన్నాయి. ఎంత బాగున్నాయంటే లక్ష్మమ్మకి కూడా కూతుళ్ళ కోసం రెండు చీరలు తీసుకోవాలనిపించింది.

వాళ్ళొక చీర సెలక్ట్ చేసుకొని గీసిగీసి బేరాలాడి పదిహేనువందలకు కొనుక్కుని వెళ్ళగా, ఆ చీరమీద ఎంత లాభం వచ్చిందో వివరించింది సుజయ.

మూడు నాలుగు వందలకు ప్లెయిన్ చీర కొంటుందామె. మనోహరమైన రంగులతో రకరకాల పూలు, ఆకులూ షాపుల్లో దొరుకుతాయి. అవి గుడ్డతోనూ, లేసు వర్క్‌తోనూ చేసినవి. వాటిని తెచ్చుకొని చీరమీద డిజైన్ తనే స్వయంగా వేసుకొని పూలు, ఆకులూ, మెరుపులూ, పూసలూ చీరకు అతికి, ఉతికినా ఊడిపోకుండా మడతలు పడిపోకుండా జాగ్రత్తగా కుట్లు వేస్తుంది. అలా డిజైన్ పూర్తిచేయడానికి ఒక నెల పడుతుంది. మూడు వందలు ఖర్చు.

## 'ది గాడ్‌ఫాదర్' కన్నుమూత

ప్రముఖ హాలీవుడ్ నటుడు, 'ది గాడ్ ఫాదర్' ఫేమ్ మార్లన్ బ్రాండో ఈ నెల 2వ తేదీన లాస్ ఏంజెల్స్‌లోని ఆసుపత్రిలో కన్నుమూశారు. ఆయన వయసు 80. రెండుమార్లు ఆస్కార్ అవార్డు అందుకున్న బ్రాండో 'ఎ స్ట్రీట్ కార్ నేమ్డ్ డిజైర్', 'ది వైల్డ్



వన్', 'ఆన్ ది వాటర్ ఫ్రంట్' వంటి చిత్రాల్లో విభిన్న పద్ధతిలో నటించి హాలీవుడ్‌లో సరికొత్త అధ్యాయానికి తెర తీశారు. ప్రముఖ హాలీవుడ్ నటులు రిలో అల్ పచీనో, రాబర్ట్ డి నీరో, జాక్ నికల్సన్ వంటి వారు బ్రాండో నుంచి ప్రేరణ పొందిన వారిలో వున్నారు.

ఇలా డిజైన్‌లు వేసి పూలు కుట్టే మహిళలు తిరుపతిలో యాభైమంది వరకూ ఉన్నారు. అయినా సుజయ వేసే డిజైన్‌లకే గిరాకీ ఎక్కువ. ఎందుకంటే ఎప్పటికప్పుడు కంప్యూటర్ ద్వారా కొత్త డిజైన్‌లు నేర్చుకుంటుందామె. ఇతరులకా సదుపాయం లేక వేసిన డిజైన్‌లే మళ్ళీమళ్ళీ వేస్తుంటారు. ఈ చీరల ద్వారా సుజయ నెలకు ఐదారు వేలు,పెళ్ళిళ్ళ సీజన్‌లో పదివేల వరకూ సంపాదిస్తోంది.

తీరిక సమయాన్ని డబ్బుగా మార్చుకుంటున్న ఆమె చాతుర్యాన్ని మెచ్చుకోకుండా ఉండలేకపోయింది లక్ష్మమ్మ.

గిఫ్ట్ ఆర్టికల్స్ ఉన్న బీరువా తెరిచి చూపించాడు సంజయ్.

ఒక అరనిండా కర్ణాభరణాలున్నాయి. సరికొత్త డిజైన్‌లు. ఆకర్షణీయమైన రంగుల్లో చాలా తేలికగా ఉన్నాయి. అవి కలపతో చేసినవంటే నమ్మలేరెవరూ., పువ్వులమ్ముకుంటున్న చోటనే కలప అమ్ముకుంటున్నానని అందుకే చమత్కరించాడు సంజయ్.

బీరువా రెండో అరలో అద్భుత కళాకృతులున్నాయి.

అక్కడక్కడా పచ్చిక, గడ్డిపూలు వ్యాపించిన రాళ్ళ గుట్ట మీద ఒంటరి చెట్టు. ఆకులు లేకుండా కొమ్మలూ రెమ్మలు ఎండిపోయి వంకర టింకరగా ఆరు అంగుళాల ఎత్తు ఉందా చెట్టు. దాని శిఖరాగ్రాన కళకళలాడుతున్న పుష్పం. ఆ చెట్టు నిరాశా నిస్పృహలకు ప్రతీకగా ఉంటే ఆశ కోల్పోవద్దని సందేశం యిస్తున్నదా పుష్పం. మొత్తం అంతా అద్దాల పెట్టెలో అమర్చారు. ఆ పువ్వు మార్చి మరో పువ్వు అమర్చుకునే వెసలుబాటూ ఉంది.

దాన్ని చూస్తూంటే రామభద్రయ్యలో కూడా కవిత ఉరికి వస్తోంది. అంత అందంగా ఉంది.

"దీని వెల ఎంత ఉంటుంది?" రామభద్రయ్యకి క్విజ్ పెట్టాడు సంజయ్.

సంకోచిస్తూనే "ఒక వంద ఉంటుందా?" అడిగాడాయన.

"పెట్టుబడి వంద అయింది. ఐదువంద లిస్తానన్నాడొకాయన"

"అయినా అమ్మలేదా?" దిగ్భ్రాంతిగా అడిగాడు రామభద్రయ్య.

"అయినకాడికి అమ్మిపారేయడం చాలా పాత పద్ధతి, అంకుల్! రేటు వచ్చేవరకూ ఆగడం ఈ నాటి విధానం."

ఐదువందలే ఎక్కువ. మరీ దురాశ కాకపోతే దాన్ని ఇంకా ఎక్కువకు అమ్మడం అయ్యేనా? అనుకున్నాడు రామభద్రయ్య.

అప్పుడే టాక్సీలో బెంగుళూరు నుంచి పువ్వులొచ్చాయి. పేర్లు తెలియని పూలు. పొడవైన కాడలతో రకరకాల రంగుల్లో ఆకారాల్లో ఉన్నాయి. వాటితోబాటు సన్నగా పొడవుగా వున్న ఆకులు ఉన్నాయి. ఉల్లికాడ చివర ఉల్లి పువ్వు మాదిరిగా మరికొన్ని. అన్నీ దృఢంగా

రేకులు ఊడిపోని విధంగా ఉన్నాయి. వారం రోజుల వరకూ వాడిపోకుండా సజీవంగా ఉంటాయట.

రామభద్రయ్య దంపతులతో కబుర్లు చెబుతూనే సంజయ్ దంపతులు పూల కాడల్ని తగిన సైజుకి కత్తిరించి చకచకా పుష్పగుచ్ఛాల తయారీలో మునిగిపోయారు. వెదురు బుట్టల్లో పూల పొదల్లాగ కొన్నింటిని, సింగిల్ పువ్వు ఆకులతో మొగలిపువ్వు ఆకారంలో కొన్ని గుచ్ఛాలు తయారుచేసి జాగ్రత్తగా వాటిని సెల్లోఫేన్ పేపర్తో చుట్టబెట్టారు. తర్వాత వాటిని టాక్సీలో మార్కెట్కి పంపారు.

పని పూర్తయ్యాక అందరికీ టీ తెచ్చింది సుజయ.

తిరుపతి చుట్టుపట్ల దర్శనీయ స్థలాలు వివరించి ప్రోగ్రాం తయారుచేసి మీరు నా టాక్సీ వాడుకోండి అన్నాడు సంజయ్.

టాక్సీ, కంప్యూటర్, టీవీ, ఫ్రిజ్లాంటివి వాయిదాల పద్ధతిలో సమకూర్చుకోవడమే కాక వాయిదాలు సక్రమంగా చెల్లిస్తున్నాడు సంజయ్. పువ్వులమ్ముకునేవాడికి ఎంత హంగు.

మర్నాడుదయమే టాక్సీ యింటి ముందు ఆగింది. డ్రైవర్కి ప్రోగ్రాం వివరించాడు సంజయ్. రామభద్రయ్య దంపతుల టాక్సీలో బయలుదేరగానే మరో టాక్సీ వచ్చింది. రాత్రంతా కూర్చుని అతి శ్రద్ధగా కట్టిన పూలహారం టాక్సీలో పెట్టింది సుజయ. రెండు బొకేలు పట్టుకొని చంద్రగిరికి బయలుదేరారు సంజయ్ దంపతులు.

మళ్ళీ వాళ్ళంతా కలిసింది ఆ సాయం కాలమే.

టాక్సీ ప్రయాణం దర్జాయే వేరు. తాము ఏయే ప్రదేశాలు చూశారో ఎంత హాయిగా ఆనందంగా ఉన్నదో వివరించారు రామభద్రయ్య దంపతులు.

తాము చేసుకొచ్చిన ఘనకార్యం గురించి వివరించాడు సంజయ్.

ప్రజల్లో అమెరికా వ్యామోహం ఎక్కువైంది.


కొడుకులు అమెరికాకి వెళ్ళిపోగా బ్రతుకును భారంగా ఈడ్చుకొస్తున్న ఒంటరి తల్లిదండ్రులు తిరుపతి పరిసర గ్రామాల్లో చాలా మంది వున్నారు. అమెరికాలో ఉంటున్న కొడుకుల ఈ-మెయిల్ అడ్రస్లు సంపాదించాడు సంజయ్.

ఆ కొడుకులకు తలిదండ్రుల మీద ప్రేమ ఉంటుంది. వారి పుట్టిన రోజులు, వివాహాది దినోత్సవాలూ ఘనంగా జరపాలనీ ఉంటుంది. డబ్బు సమస్య కాదు కానీ స్వదేశానికొచ్చి ఆ వేడుకలు జరపడానికి సెలవు దొరకదు. అందువల్ల అక్కడ కొడుకుల హృదయాల్లో బాధ. ఇక్కడ తలిదండ్రుల హృదయాల్లో వేదన. పరిష్కారం లేని బాధ. తీర్చలేని వేదన.

"ఇందుకు పరిష్కారం ఉంది. మీ తలిదండ్రుల వేదన తీరే మార్గం మేం చెబుతాం. మీ బదులుగా మేం స్వయంగా మీ తల్లి దండ్రుల్ని కలిసి గ్రీటింగ్స్ యిస్తాం. బొకే చేతిలో పెట్టి దండ వేస్తాం. కేక్ కట్ చేయిస్తాం. వేడుక ఘనంగా జరిపిస్తాం" అని

ఆ కొడుకులకు ఈ-మెయిల్ పంపాడు సంజయ్.

అమెరికాలోని వెంకట్ సరే అన్నాడు.



"దిగులుతో కుంగిపోయిన వెంకట్ తలిదండ్రుల్ని ఈ ఉదయం కలిశాం. మాతో బాటు వచ్చిన అసిస్టెంట్లు గదిని తోరణా లతో అలంకరించారు. వృద్ధ దంపతులిద్దరికీ ఒకే దండ వేశాం. గ్రీటింగ్స్ చెప్పి బొకేలు యిచ్చాం. కేక్ కట్ చేయించి ఆడాం, పాడాం. ఆ దంపతులెంత సంతోషించారో చెప్పలేం. స్వయంగా కొడుకూ కోడలూ వచ్చి నట్టు ఫీలయి పొంగిపోయారు. అదంతా వీడియో తీసి కంప్యూటర్ ద్వారా వెంకట్కి చూపించాను. అతగాడెంత ఆనందించా డంటే వెంటనే మూడు వందల డాలర్లు అంటే పదమూడు వేలు పైచిలుకు నా ఖాతాలోకి జమ చేశాడు. మా మొదటి ప్రయత్నం విజయ వంతం అయింది. ఇలాంటి బేరాలు మరెన్నో తగులుతాయి" ఉత్సాహంగా చెప్పాడు సంజయ్.

ప్రేమాభిమానాలు కూడా వ్యాపారాంశంగా మారిపోయినందుకు రామభద్రయ్యకు బాధగా అనిపించినా సంజయ్ సృజనాత్మకతను అభినందించకుండా ఉండలేకపోయాడు.

గిఫ్ట్ ఆర్టికల్ కావాలంటూ సిఖ్ఖు దంపతులు లోనికొచ్చారు. వాళ్ళు ఇతర మతాల దేవుళ్ళను పూజించకపోయినా తిరుపతి గురించి ఘనంగా విని ఆ జనసందోహాన్ని తిలకించి అక్కడి ఏర్పాట్లును, ప్రకృతి రమణీయకతను చూద్దామని వచ్చారు. వాళ్ళు యిక్కడ అడుగుపెట్టగానే మన్మోహన్సింగ్ ప్రధాని అయినట్లు తెలిసి ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయి ఒక జ్ఞాపికను కొనాలని వచ్చారు.

వాళ్ళకి ఎండిన చెట్టు మీద ఒంటరి పుష్పం ఎంతగానో నచ్చింది. వాళ్ళు కాంగ్రెస్ అభిమానులు. కాంగ్రెస్ ఎండిపోయింది. చచ్చిపోయిందని ఎందరో గేలి చేసినా ఆ ఎండిన చెట్టే ఇప్పుడు పుష్పించింది అంటూ దాన్ని ఎనిమిది వందలకు కొనుక్కొని పోయారు.

డబ్బు జేబులో వేసుకొని రామభద్రయ్య

## అన్నీ అక్కడే నేర్చుకున్నా

ఇప్పుడిప్పుడే గుర్తింపు పొందుతున్న పాయల్రోహిత్గి ఢిల్లీలో కంప్యూటర్ ఇంజనీరింగ్ పూర్తి చేసింది. ఆడపిల్లలకు సహజంగా సిగ్గెక్కువుంటుంది. అందరిలానే పాయల్ తొలిసారి నటించేటప్పటి విశేషాలు తెలుసుకుందామని 'కెమెరా ముందు తొలిసారి నిలబడ్డప్పుడు మొదటిసారి ఏమనిపించిందని' అడిగితే, "అది నాకు మొదటిసారి అయితే కదా! ఏమైనా అనిపించడానికి. కాలేజీలో ఎన్నో వేషాలు వేశాను, అంతకన్నా డ్యాన్సులూ చేశాను. ఇక కెమెరా ముందు నిలబడటం నాకు తొలిసారేముంది? అన్నీ అక్కడే నేర్చుకున్నా!" అంటూ కెమెరా తొలి అనుభవం గురించి తెలుసుకుందామనుకున్న మనల్ని తుస్సుమనిపించింది.

వైపు సగర్వంగా చూస్తూ "భారత్ వెలిగిపోతోంది" అన్నాడు సంజయ్.

"ఔనౌను! అలా ఢంకా బజాయించిన పార్టీ చిత్తుగా ఓడిపోయిందిగా" కసిగా అన్నాడు రామభద్రయ్య. రైతులు, నేత కార్మికుల ఆత్మహత్యలు ఆయన మదిలో మెదిలి స్వరంలో కాస్త కసి పెరిగి ఉంటుంది.

"అంకుల్! పార్టీలనూ, రాజకీయాల్ని అటుంచండి. మేరా భారత్ మహాన్ అంటే ఇకిలించినవాళ్ళుండొచ్చు. భారత్ వెలిగిపోతోందంటే సకిలించినవాళ్ళుండొచ్చు. కానీ మేరా భారత్ మహాన్ అనుకోవడంలో నాకొక గర్వం ఉంది. భారత్ వెలిగిపోతోంది అనుకోవడంలో నాకొక సంతృప్తి ఉంది. నాకు ఉద్యోగం లేకపోయినా ఇంజనీర్ జీతం కంటే ఎక్కువే సంపాదిస్తున్నా కాస్త ఆలోచన, మరికాస్త సృజనాత్మకత, కొంచెం చొరవ, మరికొంచెం పనిచేసే తత్వం ఉండేవాళ్ళకి భారత్ నిజంగా వెలిగిపోతోంది. నాతోబాటు బి.టెక్ పాసైన నా మిత్రులెందరో ఇప్పటికీ ఉద్యోగాలు లేక దేశం మండిపోతోందని తిట్టుకుంటూ, సొల్లుకబుర్లు చెప్పుకుంటూ తిరుగుతున్నారని నాకు తెలుసు. చొరవ, దీక్ష, దక్షత లేని అలాంటి నిరర్థకుల కోసం దేశం ఆగిపోదు. కాలం నిలిచిపోదు" కాస్త ఆవేశంగానే అన్నాడు సంజయ్.

అతని ఆతిథ్యం అనుభవిస్తూ అతని అభిప్రాయానికి వ్యతిరేకంగా మాట్లాడ్డం ఇబ్బందిగానే ఉన్నా "రెక్కల కష్టానికి ఫలితం దక్కక రైతులు, నేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వాళ్ళ దృష్టిలో దేశం వెలిగిపోవడం లేదు" నెమ్మదిగా అన్నాడు రామభద్రయ్య.

ఆయన చెయ్యి పట్టుకొని కంప్యూటర్ ఎదుటకు లాక్కెళ్ళాడు సంజయ్. గబగబా కంప్యూటర్ బటన్స్ నొక్కాడు. స్క్రీన్ మీద వరుసగా పేర్లు కనిపిస్తున్నాయి.

"జనవరి మాసంలో టమోటాలు కేజీ మూడు రూపాయలకు కొనడానికి సిద్ధంగా వున్న ఇతర జిల్లాల, ఇతర రాష్ట్రాల వ్యాపారుల పేర్లు అవి. అదే కాలంలో ఇక్కడి రైతులు ధర కిట్టక టమోటాలను రోడ్ల మీద పారబోసి ఆక్రందించారు. ఇప్పుడు చెప్పండి లోపం ఎక్కడ వుంది అంకుల్?"

రామభద్రయ్యకు ఏం చెప్పాలో అర్థం కాలేదు.

"మన రైతులు చదువులేనివాళ్ళు. కొత్త మార్కెటింగ్ విధానాలు తెలియవు. ప్రభుత్వం స్పందించలేదు. ఒప్పుకుంటాను. కానీ ఆ రైతులలో కొందరి కొడుకులు కాలేజీ చదువులు వెలగబెట్టినవాళ్ళున్నారు. సినిమా కబుర్లు చెప్పుకుంటూ, షికార్లు కొడుతూ ప్రభుత్వాన్ని విమర్శిస్తారుగానీ తండ్రుల సమస్యకి పరిష్కారం ఆలోచించారా? చొరవ తీసుకుని నలుగుర్ని కలుపుకొని లారీ మాట్లాడుకొని సరుకు యితర జిల్లాలకు, రాష్ట్రాలకు ఎందుకు తీసుకెళ్ళలేదు? కొడుకులకే తండ్రుల బాధ పట్టనప్పుడు ఎక్కడో కూర్చున్న మంత్రులకు ఏం పడుతుంది? నా వద్దకొచ్చిన రైతులకు సరుకు ఎక్కడ ఏ రేటుకి అమ్మాలో వివరాలు చెప్పాను. వాళ్ళంతా లాభపడ్డారు. అలాగే చేనేతలు. నేను పుట్టినప్పటి నుంచి ఒకే డిజైన్ తువ్వాళ్ళు, లుంగీలు, చీరలు... కాలం, ఫ్యాషన్‌లూ మారిపోతూంటే మారనిదల్లా చేనేత డిజైన్‌లే. ఇప్పుడిప్పుడే ఫ్యాషన్ నిపుణులతో చేతులు కలిపి నేతగాళ్ళు కొత్త డిజైన్‌లు సృష్టిస్తున్నారు. మనవాళ్ళెందుకలా చేయరు? చూడండి కంప్యూటర్‌లో ఎన్నిరకాల డిజైన్‌లు కనిపిస్తాయో!"

బటన్‌లు నొక్కి సంజయ్ చూపిస్తూంటే చూస్తూ ఉండిపోయాడు రామభద్రయ్య.

"కష్టాలు, నష్టాలు, నిరుద్యోగంలాంటి సమస్యలకు ప్రభుత్వ బాధ్యత ఎంతో, ప్రజల బాధ్యతా అంతే, అంకుల్! యువతరంలో చొరవ, సృజనాత్మకత, కష్టించి పనిచేసే తత్వం లేనంతకాలం ఏ ప్రభుత్వమూ ఏమీ చేయలేదు. జేబులో వెయ్యి రూపాయలతో తిరుపతిలో అడుగు పెట్టాను. సృజనాత్మకత, శ్రమ పెట్టుబడిగా పెట్టి ఐదేళ్ళలో ఈ స్థితికి ఎదిగాను. ఇంకో ఐదేళ్ళలో అప్పులన్నీ తీర్చేస్తాను. స్వంత యిల్లు సమకూర్చుకొని వ్యాపారాన్ని విస్తరిస్తాను. ఎవరేమన్నా, నా భారత్ వెలిగిపోతోంది. అదీ పరిమళభరితంగా!" సంజయ్ స్వరంలో ఆత్మవిశ్వాసం ఉరకలేస్తోంది.

రామభద్రయ్య గంభీరంగా ఆలోచిస్తూ ఉండిపోయాడు. ❋

**రావు బహద్దూర్ ఆదెళ్ళ రంగనాయకులు నాయుడు**
**ఆదెళ్ళ శ్రీరామమూర్తినాయుడు మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్**
**మరియు 'ప్రియదత్త' వారపత్రిక నిర్వహించిన**

## కథల పోటీ ఫలితాలలో

### సాధారణ ప్రచురణకు ఎన్నికయిన కథలు

| | | |
|---|---|---|
| 1. | రెండవవైపు | శాంతి ప్రభాకర్ |
| 2. | రాంకర్ | కె. వేణుగోపాల్ |
| 3. | పరిపక్వం | సి. ఉమాదేవి |
| 4. | ప్రవాహం | యర్రమిల్లి విజయలక్ష్మి |
| 5. | ప్రకృతిధర్మం | కస్తూరి మురళీకృష్ణ |
| 6. | పసిపిల్ల | కట్టారాంబాబు |
| 7. | గురివిందగింజలు | ఇ. మురళీమోహనరావు |
| 8. | మార్గదర్శులు | దొరవేటి |
| 9. | తొలగిన తెరలు | షాహీన్‌ఖాన్ |
| 10. | అంత్రబంధం | ఎలక్ట్రాన్ |
| 11. | తాబేలుగాడు | జి.వి.ఎస్. నాగేశ్వరరావు |
| 12. | వెన్నెల్లో తాజ్‌మహల్ | ఆకెళ్ళ వెంకటసుబ్బలక్ష్మి |